క్లుప్తంగా

హోంగార్డు కుటుంబానికి రూ.4లక్షల సాయం



చెక్కు అందచేస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేస్తూ మృతి చెందిన కిరణ్‌కుమార్‌ కుటుంబానికి ఎస్పీ రిషాంత్‌రెడ్డి రూ.4 లక్షల ఆర్థికసాయాన్ని మంగళవారం అందజేశారు. కిరణ్‌కుమార్‌ ఈ ఏడాది జూన్‌లో అనారోగ్యంతో చనిపోయారు. హోంగార్డుల ఒక్కరోజు వేతన నిధుల నుంచి రూ.4 లక్షల చెక్కును మృతిని భార్య నందినికు అందచేశారు. మృతుడి కుటుంబానికి పోలీసుశాఖ నుంచి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.

ఇంటి ముంగిటకే వైద్య సేవలు



వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్‌ రష్మిత

గుడిపాల: ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుతున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత అన్నారు. మంగళవారం కుపిగానిపల్లెలో 104 వైద్య సేవలను అందజేశారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వైద్యరంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. అనంతరం 67 మంది రోగులకు బీపీ, షుగర్‌, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. మంచం పట్టిన రోగులకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలు చేశారు. సిబ్బంది సరిత, సరస్వతి, శిల్ప, శివగామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లెలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, గ్రీన్‌ అంబాసిడర్లను అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి మాట్లాడారు. ప్రజాఆరోగ్యంలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ఉందని, గ్రామాలు, పట్టణాలలో పారిశుధ్యం మెరుగు పరచడంతో ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు.

నేడు చిత్తూరులో 2కే రన్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో బుధవారం 2కేరన్‌ నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని గాంధీ సర్కిల్‌ నుంచి అంబేడ్కర్‌ భవనం వరకు 2కే రన్‌ నిర్వహిస్తామన్నారు. ఉదయం 6.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నగర ప్రజలు పాల్గొనాలని కోరారు.

గృహ సారథులకు ఇన్సూరెన్స్‌ సదుపాయం

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం గృహసారథులకు ఇన్సూరెన్స్‌ సదుపాయం కల్పించిందని మండల సచివాలయ కన్వీనర్‌ సుధాకర్‌ రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గొడుగుచింత, చిటిపిరాళ్ల, పోటుకనుమ పంచాయతీల గృహ సారథుల సమావేశం జరిగింది. గృహ సారథులకు ప్రభుత్వం రూ.10లక్షల ఇన్సూరెన్స్‌ అందిస్తు అండగా ఉంటోందన్నారు. గృహ సారథులు పథకాల లబ్ధిని గ్రామీణ ప్రజలకు తెలియజేయాలన్నారు. సర్పంచ్‌లు జయచంద్ర రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌, మణి, సుబ్రమణ్యం, నిరంజన్‌ రెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్‌

చిత్తూరు అర్బన్‌: చిత్తూరు నగరంలో మహేష్‌బాబు అనే యువకుడిపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడు చిన్నతంబిని మంగళవారం వన్‌టౌన్‌ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. ఈనెల 23వ తేదీ రాత్రి గిరింపేటలోని దుర్గమ్మ ఆలయ సమీపంలో వినాయక స్వామి నిమజ్జనం కోసం గుడిపాలకు చెందిన మహేష్‌బాబు, గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం నుంచి చిన్నతంబి వచ్చారు. పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని మహేష్‌బాబుపై చిన్నతంబి కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, వన్‌టౌన్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నతంబిని న్యాయమూర్తి ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న 25మంది పిల్లలకు పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య, రఘు మంగళవారం ఖర్జూరం, రాగిజావ, నువ్వుల చిక్కీలు మొదలైన వాటితో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్‌ నజ్మా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.





ఘల్లు..ఘల్లు..ఘల్లుమంటు..

కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కట్టిపడేశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆస్థాన మండపంలో కళాకారుల భరతనాట్య ప్రదర్శనలు రంజింపజేశాయి. నాటక ప్రదర్శనలు, భక్తి గీతాల కచ్చేరి అలరించాయి. కళాకారులకు దేవస్థానం చైర్మన్‌ మోహన్‌ రెడ్డి, ఈఓ వెంకటేశు ప్రశంసా పత్రాలు అందించారు. –కాణిపాకం(యాదమరి)



కళాకారిణిల నృత్య ప్రదర్శన



భక్తి గీతాలు ఆలపిస్తున్న గాయకులు



నాటకంలో ఒక దృశ్యం

కల్యాణ వైభోగమే..





పార్వతీపరమేశ్వరుల ప్రియపుత్రుడు..ఆది పూజలందుకునే శ్రీ వినాయకస్వామి కల్యాణం రమణీయంగా సాగింది. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ బ్రహ్మోహత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శ్రీసిద్ధి, బుద్ధి దేవేరులతో గణనాథుని కల్యాణం అత్యంత వైభవంగా సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు మాంగల్య ధారణ చేశారు. తిరు కల్యాణాన్ని కనులారా తిలకించి అశేష భక్తులు తన్మయత్వం చెందారు. –కాణిపాకం(యాదమరి)

మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు

- కమర్షియల్‌ దుకాణాల్లో చెత్త డబ్బాలు వినియోగించాలి
- నగర కమిషనర్‌ అరుణ



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్‌ అరుణ

చిత్తూరు అర్బన్‌: నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని, ప్రధానంగా కమర్షియల్‌ దుకాణదారులు రోడ్లపై వ్యర్థాలను పడేయకుండా చెత్త డబ్బాలు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ డాక్టర్‌ జె.అరుణ ఆదేశించారు. కమిషనర్‌ మంగళవారం 37, 26వ వార్డు పరిధిల్లో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాత బస్టాండ్‌లో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని, నిషేధిత ప్లాస్టిక్‌ వినియోగించకుండా అవగాహన కల్పించడంతో పాటు, క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రజారోగ్యశాఖాధికారి లోకేష్‌ను ఆదేశించారు. వ్యాపారస్తులు, దుకాణదారులు వ్యర్థాలను డబ్బాల్లో వేసి నగరపాలక సంస్థ వాహనాలు వచ్చిన సమయంలో ఇచ్చేలా అవగాహన పెంచాలన్నారు. 26వ వార్డు పరిధిలో మురుగునీటి కాలువల్లో క్రమం తప్పకుండా పూడిక తొలగించాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ చిన్నయ్య, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం పుత్తూరు రోడ్డులోని డివైడర్లపై మొక్కల పెంపకాన్ని తనిఖీ చేశారు. డీఈ వెంకట ప్రసాద్‌, ఇంజినీరింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

వేగవంతంగా ఇంజనీరింగ్‌ పనులు..

నగరంలో ఇంజినీరింగ్‌ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్‌ కార్యాలయంలో ఇంజినీరింగ్‌ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా కేటాయించిన నిధులకు సంబంధించిన పనులు వేగవంతంగా చేపట్టాలన్నారు. టెండర్లు పూర్తయిన పనులను త్వరగా ప్రారంభించేలా కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎస్క్యాప్‌ నిధుల పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. మనబడి నాడు - నేడు పెండింగ్‌ పనులను వేగవంతం చేయాలన్నారు. సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులపైన కూడా సమీక్ష నిర్వహించారు. ఎంఈ గోమతి, డీఈ వెంకట ప్రసాద్‌, ఎఈలు పాల్గొన్నారు.

పఠనా సామర్థ్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: సాంకేతకతో పఠనాసామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తవణంపల్లె ఎంఈఓ హేమలత తెలిపారు. మంగళవారం తవణంపల్లె ప్రాథమిక పాఠశాల సీఆర్‌సీ సెంటర్‌లో ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు శిక్షణలో పొందిన అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల హాజరును యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. బోధనలో నూతన సాంకేతిక విధానాన్ని ఉపయోగించి నాణ్యమైన విద్య అందించి మంచి ఫలితాలను సాధించాలని వివరించారు. రీసోర్స్‌పర్సన్‌లు మునస్వామి, కె.రమేష్‌, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

వీఎస్‌ అగ్రహారంలో ‘ఫ్యామిలీ డాక్టర్‌’



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్‌ పూర్ణలత

ఐరాల: మండలంలోని వీఎస్‌.అగ్రహారంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్‌ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్‌ పూర్ణలత గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్‌ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. హెల్త్‌ అసిస్టెంట్‌ సుధాకర్‌, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్‌ఎంఎంఎస్‌ వివరాల నమోదు

చిత్తూరు కలెక్టరేట్‌ : నేషనల్‌ మీన్స్‌ మెరిట్‌ స్కాలర్‌షిప్‌ (ఎన్‌ఎంఎంఎస్‌) పరీక్షలో ఎంపికైన విద్యార్థులు వివరాలను పకడ్బందీగా పోర్టల్‌లో నమోదు చేయాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్‌ 1వ తేదీ నుంచి వివరాలు నమోదుకు అవకాశముంటుందన్నారు. అక్షరం తేడా లేకుండా మెరిట్‌కార్డు పైన ముద్రించిన విధంగానే విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. సంబంధిత స్కూల్‌ నోడల్‌ ఆఫీసర్‌ స్థాయిలో డిసెంబర్‌ 15 లోపు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. డిసెంబర్‌ 30 లోపు జిల్లా నోడల్‌ ఆఫీసర్‌ లాగిన్‌లో ధ్రువీకరించుకోవాలని స్పష్టం చేశారు. 2019 నుంచి 2022 వరకు నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులు ఈ ఏడాదికి సంబంధించి తప్పనిసరిగా రెన్యూవల్‌ చేయించుకోవాలని సూచించారు. లేకుంటే స్కాలర్‌షిప్‌ మంజూరు కాదని వెల్లడించారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో మెరుగైన వైద్యసేవలు



మాట్లాడుతున్న స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ జనార్దన్‌



హెల్త్‌ క్యాంప్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్న రోగులు

- స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ జనార్దన్‌

బంగారుపాళెం: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్‌ నోడల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ జనార్దన్‌ అన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె వైఎస్సార్‌ విలేజ్‌ క్లినిక్‌ ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్‌ క్యాంప్‌ నిర్వహించారు. దీనిని విశేష స్పందన లభించింది. శిబిరంలో 449 మందికి డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నోడల్‌ అధికారి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనికి సంబంధించి ఇక్కడ పైలెట్‌ హెల్త్‌ క్యాంప్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అలాగే 30వ తేది నుంచి గ్రామ సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహిస్తామని, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్‌ చైర్మన్‌ కుమార్‌రాజా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య సేవలు దేశంలో ఎక్కడా లేవని, ఈ సేవలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ ప్రభావతిదేవి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌ క్యాంపులలో స్పెషలిస్టు డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి వారికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇంటి ముంగిటకే వైద్యం అందిస్తోందన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్‌ రామచంద్రారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, వైస్‌ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి, తిమ్మోజుపల్లె, బొమ్మాయిపల్లె, కరిడివారిపల్లె, పాలేరు సర్పంచులు రేఖ, గౌరమ్మ, ఆశ, ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌ విండో చైర్మన్‌ దత్తాత్రేయరెడ్డి, ఈడిగ, కురబ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్లు ఎల్లప్ప, అమరనాథ్‌, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శరత్‌రెడ్డి, కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, జిల్లా నోడల్‌ అధికారి రవిరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్‌ అనిల్‌కుమార్‌, మండల వైద్యాధికారి డాక్టర్‌ లోహిత్‌ చెంగల్‌రాయన్‌, పలువురు డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌ మీటర్‌ రీడింగ్‌ కచ్చితంగా తీయాలి



సమవేశంలో మాట్లాడుతున్న ఈఈ పద్మనాభపిళ్లై

చిత్తూరు కార్పొరేషన్‌: ప్రతి ఇంటి రీడింగ్‌ను కచ్చితంగా తీయాలని, డోర్‌లాక్‌ అయితే మరోసారి వెళ్లాలని ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. మంగళవారం ఏఏఓ కార్యాలయంలో ప్రైవేటు బిల్‌ రీడర్స్‌తో సమావేశమయ్యారు. డివిజన్‌ పరిధిలో 1.50 లక్షలు సర్వీసులు ఉన్నాయని పేర్కొన్నారు. గత నెల 3,400 మీటర్లు మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. వాటిని సకాలంలో మార్చినట్లు పేర్కొన్నారు. మీటర్‌ మరమ్మతు అయితే సంబంధిత ఏఈకి తెలపాలని పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని మిట్టూరు సెక్షన్‌లో వందశాతం రీడింగ్‌ చేసినట్లు తెలిపారు. పిచ్చిపిచ్చిగా రీడింగ్‌ యూనిట్లు, తేదీలను లెక్కలు కట్టి కొందరు సోషల్‌ మీడియాలో విద్యుత్‌శాఖపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకుంటామని ఈఈ తెలిపారు. ఏఏఓ గోవిందరాజులు, డీఈ శేషాద్రి, జ్ఞానేశ్వర్‌, ఏఈ బాలచంద్ర పాల్గొన్నారు.

నిమజ్జన కోలాహలం



బంగారుపాళెంలో వినాయకస్వామి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

బంగారుపాళెం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కోలాహలంగా వినాయకుని నిమజ్జనం నిర్వహించారు. బంగారుపాళెం, తగ్గువారిపల్లె గ్రామాల్లో వినాయక ప్రతిమలకు 9 రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఉట్లోత్సవంలో ఉత్సాహంగా యువత పాల్గొంది. అనంతరం వినాయకుని ప్రతిమలను మేళతాళాలు, బాణసంచా మోత నడుమ నిమజ్జనానికి తరలించారు. సీఐ నాగరాజరావు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జిల్లా జట్టుకు ఇద్దరి ఎంపిక

పెద్దపంజాణి: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌ బాల్‌ క్రీడలకు సంబంధించి తమ స్కూలు క్రీడాకారిణులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు డి.నందకుమార్‌, పీఈటీ కేఎస్‌.ఉదయ్‌కుమార్‌ తెలిపారు. తిరుపతి జిల్లా బీఎస్‌ కండ్రిగ ఉన్నత పాఠశాలలో సెలెక్షన్స్‌ నిర్వహించి అండర్‌–14, అండర్‌–17 బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశారని, తమ స్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.భావన అండర్‌–17 బాలికల విభాగంలో, కె.కవిత అండర్‌–14 విభాగంలో ప్రతిభ చాటి ఎంపికయ్యారని తెలియజేశారు.

ఇక లోఓల్టేజి సమస్య తీరినట్లే



కేవీ కొత్త లైన్లను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి

- ట్రాన్స్‌ఫార్మర్‌ ట్రిప్పింగ్‌ ఉండదు
- 220 కేవీ లైన్లతో మెరుగైన కరెంట్‌
- రెండు కొత్త లైన్లను ప్రారంభించిన ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి

పలమనేరు: పలమనేరు ట్రాన్స్‌కో డివిజన్‌లోని గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లోని ఏడు సబ్‌స్టేషన్ల పరిధిలో రైతులకు లో ఓల్టేజి సమస్య తీరినట్లేనని ట్రాన్స్‌కో ఎస్‌ఈ(ఆపరేషన్‌) కృష్ణారెడ్డి తెలిపారు. పలమనేరులోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలకు కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ లైన్లను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో లోఓల్టేజీ కారణంగా రెండు మండలాల్లోని టెయిల్‌ ఎండ్‌లోని వ్యవసాయ మోటార్లు తరచూ కాలిపోవడం, ట్రిప్‌ కావడం, ఫ్యూజులు, రైతుల ట్రాన్స్‌ఫార్మర్లు కాలడం లాంటి సమస్యలుండేవన్నారు. దీంతో పలమనేరు నుంచి 220 ప్రత్యేక లైన్లను గంగవరం, బైరెడ్డిపల్లె మండలాలకు ఏర్పాటు చేశామన్నారు. ఫలితంగా ఇక్కడి ఏడు సబ్‌స్టేషన్లలో ఇకపై హై ఓల్టేజి కరెంట్‌ సరఫరా అవుతుందని, రైతులకు, గృహ వినియోగదారులకు ఎలాంటి విద్యుత్‌ సమస్య లుండవని చెప్పారు. ముఖ్యంగా ఓవర్‌లోడ్‌ సమస్య పరిష్కారమైనట్టేనన్నారు. కార్యక్రమంలో పలమనేరు ట్రాన్స్‌కో ఏఈ చిన్నబ్బ, ఈఈలు నాగేశ్వరావు, సురేంద్ర నాయుడు పాల్గొన్నారు.